వైసీపీ హయాంలో ఇళ్ల పథకంలో అక్రమాలు

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన పేదలకు ఇళ్ల పథకంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలో భారీస్థాయిలో అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. అసెంబ్లీలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేదలకు ఇళ్ల పథకం ఏ విధంగా పక్కదారి పట్టిందనేది వివరించారు. నియోజకవర్గంలో 100 ఎకరాల భూమిని ఇళ్ల పథకానికి సేకరించి 120 లేఅవుట్లు వేసినా వాస్తవానికి ఇళ్లనిర్మాణం 20 లేఅవుట్లలోనే జరిగిందని తెలిపారు. మిగతా లేఅవుట్లన్నీ నిరుపయోగంగా మారిపోయాయన్నారు. నివాసయోగ్యమైన ప్రదేశాలు కాకుండా ముంపు ప్రాంతాలు, కొండ ఎగువప్రాంతాలు, గ్రామాలు, పట్టణాలకు దూర ప్రాంతాలను ఎంపిక చేసి లబ్ధిదారులకు కేటాయించడంవల్ల పేద కుటుంబాలు ఇబ్బందులకు గురయ్యాయన్నారు. అర్హతఉన్న ప్రతి కుటుంబానికి రెండు సెంట్ల స్థలం ఇస్తామన్న కూటమిప్రభుత్వం వాగ్దానంపై ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. అర్హులైన కుటుంబాలకు స్థలాలు కేటాయించాలని కోరారు.

వైసీపీ పాలనలో టీటీడీని భారీగా దోచుకున్నారు

- అసెంబ్లీలో జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానాన్ని భారీగా దోచుకున్నారని టీటీడీ పాలక మండలి సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆరోపించారు. అసెంబ్లీలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పరకామణిలో సీవీ రవికుమార్ 2023, ఏప్రిల్ 29న దొంగిలించిన ఘటన సీసీ ఫుటేజీ ద్వారా పట్టుకున్నారని, విచారణలో రూ.200కోట్లు భారతీయ కరెన్సీ ఇదేవిధంగా దొంగిలించాడనేది నిర్ధారణ అయిందని అన్నారు. స్వామివారి హుండీని వైసీపీలోని కీలక నేతలు దోచుకున్నారని, ఈ సొమ్ములో తాడేపల్లి ప్యాలెస్‌కు కూడా చేరాయని, టీటీడీలో సీవీ రవికుమార్ దగ్గర నుంచి భూమన కరుణాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులుగా పని చేసిన వారికి కూడా ఇందులో వాటాలు ఉన్నాయని విమర్శించారు. వైసీపీ పాలనలో పరకామణిలో జరిగిన దొంగతనం కేసును సిట్ విచారణకు ఆదేశించాలని తెలిపారు. దేవుడు సొమ్మును దోచేసినవారిని కఠినంగా శిక్షించాలన్నారు.

మహాలక్ష్మి అవతారంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు



మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చిన బాలాత్రిపురసుందరి అమ్మవారు

కాకినాడసిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్యారావుపేటలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదోరోజైన శుక్రవారం బాలాత్రిపురసుందరి అమ్మవారు మహాలక్ష్మిఅవతారంలో దర్శనమిచ్చారు. నవావరణార్చన, చండీహోమం జరిపారు. ఆలయ ఛైర్మన్ గ్రంథి బాబ్జీ, ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి, కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అభివృద్ధికి..

జల..బాట!



జల రవాణాపై ఇదీ లెక్క..

ఉమ్మడి జిల్లాలో కాకినాడ నుంచి ఏలూరు కాలువ వరకు ఇన్‌లాండ్ వాటర్ కింద నదీ మార్గాల్లో కార్గో తరలింపుపైనా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వివరించారు. గోదావరి నది ద్వారా కృష్ణాకు, కాకినాడ-ఏలూరు కాలువ, కాకినాడ-బకింగ్‌హాం కెనాల్ నుంచి చెన్నైకు, గోదావరి ద్వారా మహారాష్ట్రకు జల రవాణాకు ఎంతో ఆస్కారం ఉందని వివరించారు. నదులపై కాలువ మార్గాల ద్వారా అనేక పరిశ్రమలకు కార్గో ఏవిధంగా తరలించవచ్చనే దానిపై ఇప్పటికే టెండర్లు పిలిచామని చెప్పారు. ఈ మార్గాలను అభివృద్ధి చేయడానికి కొందరు ముందుకు వస్తున్నారన్నారు. రవాణా రంగం ఖర్చుల విషయానికి వస్తే టన్ను కార్గో రవాణా ఖర్చుకు రోడ్డు మార్గం ద్వారా రూ.3.78 అవు తుంటే.. సముద్రమార్గం రవాణాకు రూ.1.80, నదీ జలరవాణాకు రూ.3.30 అవుతుందన్నారు.



అసెంబ్లీలో జలరవాణాపై చంద్రబాబు కీలక ప్రసంగం

- ఓడరేవు, లాజిస్టిక్ అభివృద్ధి
- రూ.2,621 కోట్లతో గేట్‌వే పోర్టు
- వచ్చే ఏడాది డిసెంబర్‌కు పూర్తి
- జలరవాణాకు కసరత్తు
- విమానాశ్రయ రన్‌వే విస్తరణ
- ఓఎన్జీసీ, గెయిల్ విధ్వంసంపై చర్చ
- ఉమ్మడి జిల్లాకు అద్భుత భవిష్యత్తు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఓడరేవులు, నదీ జల రవాణాతో పారిశ్రామికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు అద్భుత భవిష్యత్తు లభించబోతోందని సీఎం చంద్రబాబు అన్నారు. అత్యంత చవకైన కార్గో రవాణా ద్వారా పారిశ్రామిక అభివృద్ధి పెద్ద ఎత్తున జరగనుందని వివరించారు. ఈ మేరకు అసెంబ్లీలో సీఎం శుక్రవారం పారిశ్రామిక, ఓడరేవు, లాజిస్టిక్ రంగాల్లో కొనసాగుతున్న పెట్టుబడులు, భవిష్యత్ ప్రాజెక్టులను కూలంకషంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విశ్లేషించారు. తీరప్రాంతాన్ని గుజరాత్ తర్వాత దేశంలో ఆంధ్రప్రదేశ్ సమర్థవంతంగా వినియోగించుకుంటోందన్నారు.

సీఎం ఏమన్నారంటే..

కాకినాడ గేట్‌వే పోర్టు(కేజీపీఎల్) రూ.2,621 కోట్లతో చేపట్టిన కొత్త పోర్టు నిర్మాణం వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తవుతుందన్నారు. ఈ కొత్త పోర్టు అందుబాటులోకి వస్తే ఏటా 16 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ జరుగుతుందన్నారు. ప్రస్తుతం పోర్టులో మూడు బెర్తుల నిర్మాణం జరుగుతోంది. ఒకటి బొగ్గు దిగుమతికి, మరో రెండు బెర్త్‌లు అన్ని రకాల కార్గో ఎగుమతి,దిగుమతులకు వినియోగిస్తున్నారన్నారు. వచ్చే ఏడాది డిసెంబరుకు ఇది అందుబాటులోకి వస్తే మౌలిక వసతులు, పారిశ్రామికంగా ఆ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని సీఎం వివరించారు. ఇదికాకుండా ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్న కాకినాడ సీపోర్టు ద్వారా ఏటా 26 మిలియన్ మెట్రిక్ టన్నులు, కాకినాడ యాంకరేజ్ పోర్టు ద్వారా 4 మిలియన్ మెట్రిక్ టన్నులు, కోన సీమలోని రవ్వ పోర్టు ద్వారా 2 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడిచమురు కార్గో కార్యకలాపాల ద్వారా జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తులో ఈ పోర్టుల ద్వారా వ్యాపారం పెరుగుతుందన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం..

ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో గోదావరి కాలువలపై సరుకు రవాణా, పర్యాటక యాత్రలకు పది రూట్లను ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఎంపిక చేసి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. నేషనల్ వాటర్‌వే-4 ద్వారా కాకినాడ కెనాల్, గోదావరి మీదుగా సిమెంట్ ఫ్యాక్టరీలు, పవర్ ప్లాంట్లకు ముడిసరుకు సరఫరాకు ప్రణాళికలు తయారు చేసింది. ఈ మేరకు కాకినాడ- రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం- విజయవాడ కెనాల్, రాజమహేంద్రవరం- భద్రాచలం, పురుషోత్తపట్నం-భద్రాచలం గోదావరి మార్గం, పురుషోత్తపట్నం-పోలవరం,నర్సాపూర్ వెస్ట్- అంతర్వేది- సఖినేటిపల్లి, కోటిపల్లి-ముక్తేశ్వరం మార్గాలను ఎంపిక చేసింది. విమానయాన రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు రన్‌వే విస్తరణ కూడా చేపట్టామని సీఎం వివరించారు.

ఓఎన్జీసీ, గెయిల్‌పై వాడివేడిగా..

ఉమ్మడి జిల్లాలో చమురు, గ్యాస్ కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఓఎన్జీసీ, గెయిల్ సంస్థల తీరుపై అసెంబ్లీలో కోనసీమ జిల్లా ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓఎన్జీసీ, గెయిల్ గ్యాస్, చమురు పైపులైన్ల కారణంగా గోదావరి తీర ప్రాంతం దెబ్బతిందని, ప్రధానంగా కోనసీమ జిల్లాలో భూగర్భ జలాలు పాడైపోయాయని రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు కంపెనీలు కనీసం సీఎస్సార్ అమలులోను బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ సంస్థల వల్ల అనేక చోట్ల భూమి కుంగిపోయి డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయని వివరించారు. దీనిపై శాస్త్రీయ అధ్యయనం జరగాలని డిమాండ్ చేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ ఈ రెండు సంస్థలు ఏర్పాటయ్యే సమయంలో స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఆ తర్వాత మోసగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిద్దరి ప్రశ్నలకు మంత్రి బీసీ జనార్దనరెడ్డి అసెంబ్లీలో సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలపై త్వరలో అధికారుల ద్వారా నివేదిక రప్పిస్తామని, తదనుగుణంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. భూమి కుంగిపోవడం, సముద్రంలోకి వెళ్లకుండా మురుగునీటి డ్రైన్లు పొంగుతున్నాయన్న సమస్యపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎస్సార్ నిధులు ఖర్చు చేయడం లేదనే విషయంపై నివేదికలు రప్పిస్తామని తెలిపారు.

లక్షలు వెచ్చించినా..

నెరవేరని లక్ష్యం



- అసంపూర్తిగా సమీకృత వ్యవసాయ ప్రయోగశాలలు
- అందుబాటులోకి వచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు
- ఒక్క జగ్గంపేటలోనే పూర్తిస్థాయి ప్రయోగాలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వ హయాంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సమీకృత వ్యవసాయ ప్రయోగశాలలు రైతులకు సేవలు అందించలేకపోయాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వీటి లక్ష్యం నెరవేరడంలేదు. పలుచోట్ల నిర్మించిన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. నిపుణులైన సిబ్బందిని నియమించకపోవడం, పరికరాలను సమకూర్చకపోవడంతో భవనాలు అలంకారప్రాయంగా మిగిలాయి. పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే విత్తనాలు, ఎరువులు, రసాయనాలు నాణ్యమైనవి ఉండాలి. లేకపోతే నష్టాలు తప్పవు. ఈ నేపథ్యంలోనే ఆయా ఉత్పాదకాల నాణ్యతను నియోజకవర్గంలో పరిశీలించడానికి అప్పట్లో సమీకృత వ్యవసాయ ప్రయోగశాల(ఐఏఎల్) ఏర్పాటు చేశారు. ఇందుకోసం నాబార్డు, ఆర్‌కేవీవై తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు పొందారు. కాకినాడ జిల్లాలో ఇలా ఐదు ప్రయోగశాలలను నిర్మించారు. కాకినాడ నియోజకవర్గానికి సంబంధించి కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలో, జగ్గంపేట నియోజకవర్గానికి సంబంధించి జగ్గంపేట, తుని నియోజకవర్గానికి సంబంధించి తునిలో, ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి శంఖవరం, జిల్లా ప్రయోగశాలను సామర్లకోటలో నిర్మించారు. అప్పట్లో సరైన ప్రణాళిక, కార్యాచరణ లేక సిబ్బంది నియామకంలో అలసత్వం చూపడంతో అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. పూర్తిస్థాయిలో జగ్గంపేట ఒక్క కేంద్రమే అందుబాటులోకి వచ్చింది.

వ్యవసాయ ప్రయోగశాల అంటే..

సమీకృత వ్యవసాయప్రయోగశాల అంటే విత్తనాలు, ఎరువులు, రసాయనాలు, భూసార పరీక్షలుఉండాలి. కానీ ప్రస్తుతం ఇవి అందుబాటులో లేవు. ఇక్కడ భూసార పరీక్షల నిర్వహణకు బీఎస్సీ అగ్రికల్చర్ చదివిన పట్టభద్రులు అర్హులు. ఇవి లేని కొందరు వ్యవసాయ విస్తరణాధికారులతో పనిచేయించారు. కొన్నిచోట్ల స్థానిక మండల వ్యవసాయాధికారిని తాత్కాలిక ప్రయోగశాల అధికారిగా నియమించారు.

వినియోగంలోకి తెచ్చేలా..

సమీకృత వ్యవసాయ ప్రయోగశాలలపై ప్రభుత్వం దృష్టిసారించింది. వృథాగా ఉంటున్న వీటి సంఖ్యను తగ్గించనుంది. జిల్లాకు రెండింటిని పరిమితం చేసి, మిగిలిన ప్రయోగశాలలను కార్యాలయాలుగా ఉపయోగించనున్నారు. మార్పుల తర్వాత ప్రయోగశాలలు రైతులకు మరింత మెరుగైన సేవలందించేలా చూడాలని వ్యవసాయాధికారులకు సూచించారు. అన్నిరకాల ఉత్పాదకాల నాణ్యతపై అవగాహన కల్పించి, నాణ్యత తక్కువఉన్న వాటికి పరీక్షలు చేయించేలా చైతన్యం తీసుకురానున్నారు.ఉత్పాదకాలు అందుబాటులోకి వస్తే పెట్టుబడులు తగ్గి.. ఉత్పత్తి పెరుగుతుంది.

19 వరకు జీఎస్టీపై అవగాహన కల్పించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై వచ్చేనెల 19 వరకు జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహించాలని జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.జిల్లా, నియోజకవర్గ, మండల, వార్డు, సచివాలయ స్థాయిల్లో జీఎస్టీ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో జీఎస్టీపై హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. జీఎస్టీ 2.0 కింద ప్రజలకు కలిగే లబ్ధిపై పూర్తి అవగాహన సదస్సులను నాలుగు వారాలపాటు నిర్వహించాలన్నారు. తొలివారం ఇంట్లో వినియోగించే నిత్యావసర వస్తువుల ధరల పొదుపుపై అవగాహన కల్పించాలన్నారు. రెండోవారం వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన వస్తువులపై, విద్య, పారిశ్రామిక అనుబంధ రంగాలు, ద్విచక్ర వాహనాలు, కార్లపై అవగాహన కల్పించాలన్నారు. మూడో వారం జీవిత బీమా, ఎలక్ట్రానిక్స్ ఎంప్లాయిమెంట్‌పై అవగాహన కల్పించాలన్నారు. నాలుగో వారం పర్యాటకం, మందుల రవాణా, రెన్యువబుల్ ఎనర్జీ, మ్యానుఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్స్ వంటి వాటిపై అవగాహన ఉత్సవాలు నిర్వహించాలన్నారు. జీఎస్టీ తగ్గింపు నేపథ్యంలో గతంలో ఉన్న ధరలకు ప్రస్తుతం ఉన్న ధరలను పోల్చి చూపాలన్నారు. ఔషధాలు, ఆరోగ్య బీమా, నిత్యావసర వస్తువులు, పుస్తకాలు ఏ మేరకు తగ్గాయో విశదపరచాలన్నారు. డీఆర్వో వెంకట్రావు, జీఎస్టీ జాయింట్ కమిషనరు శ్రీలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, డీపీవో రవికుమార్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు విముక్తి

- శ్రీలంక జైలు నుంచి మత్స్యకారుల విడుదల

7

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ధాన్యం సేకరించాలి

- రైతులు దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు
- ప్రభుత్వమే మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుంది: జేసీ రాహుల్



కలెక్టరేట్(కాకినాడ),సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ధాన్యం కొనుగోలు శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 269 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అన్ని అంశాలపైన క్షేత్రస్థాయి అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. వివిధ శాఖలు సమన్వయంతో పని చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, తేమశాతం యంత్రాలు, గోనెసంచులు అందుబాటులో ఉంచాలన్నారు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైస్ మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకుండా ధాన్యానికి ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధర పొందేలా రైతులకు అవగాహన పెంచాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 85శాతం ఈ-పంట నమోదైందన్నారు. మిగిలిన 15శాతాన్ని ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 3లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరిస్తామన్నారు. ప్రధానంగా 2025-26 ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలు, క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, నాణ్యతా ప్రమాణాలు అమలు చేయడం, కనీస మద్దతు ధర, గోనెసంచులు, మండలస్థాయి కొనుగోలు కమిటీ ఏర్పాటు, కస్టోడియన్ అధికారుల నియామకం, ఈ-క్రాప్ బుకింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు దేవుల నాయక్, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి, పౌరసరఫరాల శాఖాధికారి సత్యనారాయణరాజు, లీగల్ మెట్రాలజీ డీసీఎస్ జనార్దనరావు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు 1,247 మెట్రిక్ టన్నుల యూరియా



సామర్లకోటలో రైల్వే ర్యాక్ నుంచి లారీలోకి లోడింగ్ చేస్తున్న యూరియాను పర్యవేక్షిస్తున్న వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్

- సామర్లకోట, ద్వారపూడి నుంచి వివిధ ప్రాంతాలకు సరఫరా
- నేడు జిల్లావ్యాప్తంగా రైతులకు పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు శుక్రవారం 1,247 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఈ నిల్వలను సామర్లకోట, ద్వారపూడిల్లో రైల్వే ర్యాక్‌ల నుంచి లారీల్లోకి లోడింగ్ చేశారు. లారీల్లో జిల్లాలోని పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు ఎరువుల డీలర్లకు చేరవేస్తున్నారు. శనివారం జిల్లావ్యాప్తంగా రైతులకు పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు 23,360 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటివరకు 24,465 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యిందన్నారు. జిల్లాకు వచ్చిన యూరియాను అన్ని మండలాలకు అవసరం మేరకు పంపిస్తున్నామన్నారు. ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ బృందాలు చేసిన దాడుల్లో ఇప్పటివరకు 269 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశామన్నారు. దీని విలువ రూ.57లక్షలుగా నిర్ధారించామన్నారు.43 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశామన్నారు. రైతులు ఎరువులను అధికంగా వినియోగించవద్దన్నారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు మాత్రమే యూరియా వినియోగించాలన్నారు. ఖరీఫ్‌లో సాగులో అధిక దిగుబడులు సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని జేడీ విజయ్‌కుమార్ తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఉద్యోగాలకు నేడు ఓరియంటేషన్

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జర్మనీలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అపారమైన ఉద్యోగావకాశాలు, వృత్తి మార్గాలపై ఆఫ్‌లైన్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్ ఎం.వేణుగోపాల్‌వర్మ తెలిపారు. జర్మనీలో ఫుడ్‌ప్రాసెసింగ్ రంగంలో ఉద్యోగం పొందాలనే ఆసక్తి ఉండి 18 నుంచి 28 ఏళ్లలోపు వయసు ఉండి డిగ్రీ, బీటెక్ కాకుండా డిప్లొమా, పాలిటెక్నిక్, ఇంటర్మీడియట్ పాసైన వారు హాజరుకావాలని, శిక్షణ, జీతభత్యాలు, జర్మనీలో అవకాశాలను నిపుణులు వివరిస్తారు.

కూరాడలో భారీ స్కాం!

- బ్యాంక్ కరస్పాండెంట్, యానిమేటర్‌ల చేతివాటం
- డ్వాక్రా సంఘాల సొమ్ములు రూ.కోటిన్నర స్వాహా!

కరప, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కరప మండలం కూరాడలో భారీ స్కాం చోటుచేసుకుంది. స్థానిక బ్యాంక్ కరస్పాండెంట్, యానిమేటర్‌లు చేతివాటం ప్రదర్శించడంతో డ్వాక్రా సంఘాల సభ్యులు కట్టిన దాదాపు రూ.1.5కోట్ల మేర సొమ్ము స్వాహా అయినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. గ్రామంలోని 106 డ్వాక్రా గ్రూపులకు కరప మండలం వేళంగిలోని ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్‌లు కోట్లరూపాయల రుణాలు ఇచ్చాయి. తీసుకున్న రుణాలకు వాయిదాలు, పొదుపు, స్త్రీనిధి సొమ్ములను ప్రతినెల క్రమం తప్పకుండా ఆయా సంఘాల సభ్యులు కూరాడలోనే ఉన్న బ్యాంక్ సర్వీస్ ప్రొవైడర్‌కు కట్టేవారు.బ్యాంక్ కరస్పాండెంట్ ఆ సొమ్ములను బ్యాంక్‌కు జమ చేయకుండా వేరే వ్యక్తిగత ఖాతాకు జమ చేసుకుంటూ సంఘాల సొమ్ములను మళ్లించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా 2022 నుంచి సంఘాలు కట్టే సొమ్ముల్లో చాలా వరకు పక్కదారి పట్టించినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. ఇవేమీ తెలియని సంఘాల సభ్యులు ఎంతకీ తమ అప్పులు తీరకపోవడంతో అనుమానం వచ్చి ఆరాతీశారు. తాము కట్టిన సొమ్ములు ప్రధాన బ్రాంచ్‌ల్లో జమకావడం లేదని తెలిసి షాక్ తిన్నారు. దీనిపై పలు సంఘాల సభ్యులు వెలుగు ఏపీఎంకు ఫిర్యాదు చేశారు. ఆమె బ్యాంక్‌లకు వెళ్లి ఆరాతీయగా కూరాడ సంఘాల రుణాల చెల్లింపుల్లో లక్షలాది రూపాయలు గోల్‌మాల్ జరిగినట్టు నిర్ధారణ అయ్యింది. ప్రాథమికంగా 26 గ్రూపులకు సంబంధించిన అకౌంట్లు పరిశీలించగా రూ.20లక్షల మేర సొమ్ములు దుర్వినియోగమైనట్టు నిర్ధారణ అయ్యిందని ఏపీఎం దేవి తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ చేపడితే గానీ ఎంత సొమ్ము పక్కదారి పట్టిందనే విషయమై స్పష్టత రాదని ఆమె స్పష్టం చేశారు. దీనిపై అధికారులు తక్షణం విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలు కోరుతున్నారు. ఈ సొమ్ముల గోల్‌మాల్ వెనుక ఓ యానిమేటర్, బ్యాంక్ కరస్పాండెంట్ కీలక పాత్ర పోషించినట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అనపర్తి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా సూర్యకుమారి



అనపర్తి,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా పెదపూడి మండలం గొల్లల మామిడాడకు చెందిన జుత్తుక సూర్యకుమారి నియమితులయ్యారు. అనపర్తి మార్కెట్ కమిటీకి నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో విడుదల చేసింది. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అధ్యక్షురాలిగా జుత్తుక సూర్యకుమారి, వైస్ ఛైర్మన్‌గా కోనాల వెంకటరెడ్డి, డైరెక్టర్లుగా పలువురిని నియమించారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పీసీపీఎన్‌డీటీ చట్టంలో భాగంగా కలెక్టర్ ఆదేశానుసారం ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫారం-ఎఫ్ అప్‌లోడ్‌చేయని అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ హెచ్చరించారు. ఫారం-ఎఫ్ రికార్డులను రెండేళ్లపాటు భద్రపర్చి ఉంచాలన్నారు. రిఫరల్ స్లిప్ లేనిదే అల్ట్రాసౌండ్ స్కాన్ చేయకూడదన్నారు. ఫారం-ఎఫ్ నమోదు చేసేటప్పుడు గర్భిణీ, స్కాన్ చేసిన డాక్టర్ సంతకాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టం-1994 ప్రకారం స్కానింగ్, ఇతర గర్భస్థ శిశుపరీక్షల ద్వారా లింగ నిర్ధారణ, వివరాలను వెల్లడించడం చట్టరీత్యా నేరమన్నారు. చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి, అందుకు ప్రోత్సహించినవారికి 3-5ఏళ్ల జైలుశిక్ష, రూ.50వేలనుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామన్నారు. ఏ ఆస్పత్రిగానీ, డయోగ్నోస్టిక్ సెంటర్‌గానీ రిజిస్టర్ కాకుండా ఏఆర్‌టీ, సరోగసి కేంద్రం నిర్వహిస్తే చట్టప్రకారం శిక్షార్హులన్నారు. జిల్లాలో ఏ ఆర్‌టీ లెవెల్-2కి సంబంధించి 4, లెవెల్- 1కు సంబంధించి 1సెంటర్‌కు అనుమతి ఉందన్నారు.

రత్నగిరిపై అగ్నిప్రమాదం

ఫ్యాన్సీషాపు గొడౌన్ దగ్ధం

రూ.10 లక్షల ఆస్తినష్టం



పశ్చిమ రాజగోపురం వద్ద దగ్ధమవుతున్న గొడౌన్

అన్నవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శుక్రవారం వేకువజామున 4 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. షార్టు సర్క్యూట్ కారణంగా ఫ్యాన్సీషాపు గొడౌన్ అగ్నికి ఆహుతైంది. ఈ మంటలు పక్కనున్న రెండు గొడౌన్‌లకు వ్యాపించగా అక్కడ స్వల్ప నష్టం కలిగింది. తుని అగ్నిమాపక సిబ్బంది ఫైరింజిన్ సహాయంతో మంటలను అదుపు చేశారు. ఫ్యాన్సీ షాపును మార్నీడి భాస్కరరావు లైసెన్స్ హక్కుపొందారు. సుమారు రూ.10లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఈవో వీర్ల సుబ్బారావు, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పరిశీలించారు. దీనిపై నివేదికను దేవదాయ కమిషనర్‌కు పంపుతామని లీజుల విభాగం అధికారులు తెలిపారు. నిబంధనల మేరకు గొడౌన్ కేటాయించారా లేదా అనేదానిపై ఈవో సంబంధిత అధికారులను అడగగా సంబంధింత ఫైలు కనిపించలేదని చెప్పినట్టు సమాచారం.

కపిలేశ్వరపురంలో 25 గ్రాముల బంగారం, 32 తులాల వెండి చోరీ


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలోని చప్పిడి శ్యాంప్రసాద్ ఇంట్లో 25 గ్రాముల బంగారం, 32 తులాల వెండిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు అంగర ఏఎస్ఐ ఆర్.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన చప్పిడి శ్యాంప్రసాద్, ధనలక్ష్మి దంపతులు మంగళవారం బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం సాయంత్రం ఇంటికి తిరిగి రాగా తలుపు తాళాలు, బీరువా తాళాలు, పగలగొట్టి బంగారం, వెండి దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మండపేట సీఐ దొరరాజు, ఆధ్వర్యంలో జిల్లా క్లూస్‌టీం సంఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. చప్పిడి ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

లారీ చోరీపై కేసు

రాజానగరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలచర్లలో హైవే రహదారిని ఆనుకుని ఉన్న కాటా వద్ద పార్క్ చేసిన లారీ చోరీకి గురైందని పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం.. దివాన్‌చెరువుకు చెందిన అబ్బిరెడ్డి నాగేశ్వరరావుకు పాలచర్ల పంచాయితీలో హైవేపై ఎఎస్ఆర్ కాటా ఎదురుగా శ్రీకృష్ణ ఇన్ఫ్రా పేరుతో లారీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ ఉంది. గణేశ్వరరావు బంధువులను కలిసేందుకు హైదరాబాద్ వెళ్తూ తన నాలుగు లారీలను కాటా ఎదురుగా గురువారం పార్క్ చేశాడు. రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్లి శుక్రవారం ఉదయం 11గంటలకు వెళ్లి చూసేసరికి షాప్ దగ్గర నాలుగు లారీలకు మూడు మాత్రమే ఉన్నాయి. ఏపీ39 డబ్ల్యూసీ 7729 నెంబరు గల లారీ కనపించక ఎవరో దొంగిలించుకుపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజానగరం ఎస్ఐ కె.ప్రియకుమార్ కేసు నమోదు చేశారు.

అన్నవరంలో గంజాయితో వ్యక్తి అరెస్ట్


గంజాయితో వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

అన్నవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం జాతీయ రహదారిపై శుక్రవారం గంజాయి తరలిస్తున్న తమిళనాడు కాంచీపురానికి చెందిన ఉత్తమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. అతడి నుంచి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచామన్నారు.

పాము కాటేస్తే.. పర్లేదని పూజలు

పరిస్థితి విషమించి ఆదివాసీ మృతి


మృతిచెందిన జోగయ్య

ఎటపాక, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) పాము కాటుతో వలస ఆదివాసీ మృతి చెందిన ఘటన శుక్రవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీలోని చింతలపాడువలస గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మడకం జోగయ్య (34) రోజు మాదిరిగానే ఇంట్లో నేలపై నిద్రించాడు. శుక్రవారం తెల్లవారుజామున జోగయ్యను పాము కాటేసినట్టు కుటుంబ సభ్యులకు చెప్పాడు. కానీ పర్లేదులే అన్నట్టు జోగయ్యను ఆసుపత్రికి తీసుకెళ్లకుండా మంత్రాలతో పూజలు చేసి నాటు వైద్యంతో ఇంట్లోనే ఉంచి సపర్యలు చేశారు. దీంతో ఆరోగ్య పరిస్థితి విషమించి జోగయ్య మధ్యాహ్నం ఇంటి వద్దే మృతిచెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. నెలరోజుల క్రితం జోగయ్య దంపతులకు మగ బిడ్డ పుట్టాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది.

కలువ పువ్వుల కోసం చెరువులోకి దిగి..

సాయంత్రానికి శవమై తేలి..



చెరువులో గాలిస్తున్న ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది


వరప్రసాద్ (ఫైల్)

గొల్లప్రోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పూజ నిమిత్తం కలువ పువ్వుల కోసం చెరువులోకి దిగి వ్యక్తి గల్లంతయ్యాడు. సాయంత్రానికి మృతదేహం లభ్యమైంది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని రైల్వే స్టేషన్ వీధికి చెందిన మడబాల వరప్రసాద్ (30) శుక్రవారం ఆలయంలో పూజల కోసం సూర్యుడు మంచినీటి చెరువులోకి దిగాడు. కలువ పువ్వులు కోసేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడు. దీంతో స్థానికులు, ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది గాలించారు. సాయంత్రానికి మృతదేహం లభ్యమైంది. అతడు తాపీ పనిచేసి జీవనం సాగిస్తూ ఉంటాడు. భార్యతో విడాకులు తీసుకున్నాడు. గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణ శోభితం... మహాశక్తి యాగం

- కల్యాణ రాముని ఉత్సవ విగ్రహం, బంగారు పాదుకలు, బాణం ప్రదర్శన
- వీక్షించిన వేలాది మంది భక్తులు
- 60 కోట్లకు చేరిన లలితా సహస్రనామ కుంకుమార్చనలు


అయోధ్య శ్రీరాముని విగ్రహం, బంగారు పాదుకలు, ధనుర్బాణం


పూజిస్తున్న భక్తులు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగం శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. అయోధ్య నుంచి తెచ్చిన బంగారు కల్యాణ రాముని విగ్రహం, బంగారు పాదుకలు, బంగారు ధనుర్బాణాన్ని వీక్షించి భక్తులు పులకించారు. వంద కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చన 60కోట్లకు చేరింది. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. మొదటిసారి మహాశక్తి యాగానికి శ్రీరాముడు పాదుకలు రాగా రెండోసారి ధనుర్బాణాలు వచ్చాయన్నారు. ఇప్పుడు బంగారు రాముడు, ఆయుధాలు రావడం యాధృచ్ఛికమన్నారు. మంత్రం ఫలించాలంటే మనసు ప్రధానమని, భావం దృఢంగా ఉంటే మంత్రం చెప్పకపోయినా ప్రకృతి దానికి సహకరిస్తుందన్నారు. అయోధ్యలో రూ.200 కోట్లతో కల్యాణ రాముడు గుడి నిర్మిస్తున్నామని, ఈ విగ్రహ శంకుస్థాపనకు స్వామీజీని ఆహ్వానిస్తున్నట్టు అయోధ్యకు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి తెలిపారు. తెలుగువాళ్ల కోసం వసతి, ఉచిత భోజనం అమలు చేస్తున్నామన్నారు. ముందుగా వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ దుర్గాసూక్త, ప్రత్యంగిర హోమాలు నిర్వహించారు. అయోధ్య నుంచి తీసుకువచ్చిన బంగారు కల్యాణరాముని ఉత్సవ విగ్రహం, పాదుకలు, కోదండం, ధనుర్బాణం ప్రదర్శించారు. 50వేల మంది భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, ట్రాఫిక్ సీఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు పి.శ్రీనివాసకుమార్, ఆచార్యులు, రత్నం, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మళ్లీ పెరుగుతున్న వరద

- భద్రాచలం వద్ద 44.7 అడుగుల నీటిమట్టం
- చింతూరు డివిజన్‌లో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- అప్రమత్తంగా ఉండాలి : పీవో


ఉధృతంగా ప్రవహిస్తున్న సోకిలేరు వాగు వద్ద వాహనాదారుల పాట్లు

చింతూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోదావరి, శబరి నదులు మళ్లీ పెరుగుతున్నాయి. దీంతో లోతట్టువాసులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి 44.7 అడుగుల మేర ప్రవహిస్తోంది. కూనవరం వద్ద గోదావరి నది శబరి నదికి ఎగపోటు నివ్వడంతో శబరి ఉధృతి కూడా పెరుగుతోంది. దీంతో చింతూరు- వరరామ చంద్రపురం మండలాల నడుమ సోకిలేరు వాగు ఉధృతి పెరిగింది. ఈ క్రమంలో అటుగా రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరం మండలంలోని కోండ్రాజపేట, టేకులబోరు నడుమ, వరరామ చంద్రపురం మండలంలో తుష్టివారిగూడెం అడవి వెంకన్నగూడెం నడుమ చింతరేవుపల్లి కన్నయ్యగూడెం నడుమ, ఎటపాక మండలంలోని నెల్లిపాక వీరాయిగూడెంల నడుమ కన్నాయిగూడెం గట్టుగూడెంల నడుమ చింతూరు మండలం, వరరామచంద్రపురం మండలాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో లోతట్టు వాసులు అప్రమత్తంగా ఉండాలని చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ పేర్కొన్నారు. చేపల వేటకు ఎవరూ వెళ్లవద్దని ఆయన సూచించారు.

వరద నీటిలోనే గండిపోశమ్మ ఆలయం


వరదనీటిలో గండిపోశమ్మ ఆలయం పై భాగం

దేవీపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత 3 రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి క్రమేపి పెరుగుతోంది. ముంపు పరివాహ ప్రాంతాలకు వరద నీరు చేరుతుంది. ప్రసిద్ధి పుణ్యక్షేత్రం మాతశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయ పైభాగం వరకు వరద నీరు చేరింది. పాపికొండలు వెళ్లే పర్యాటక బోట్లు వరదల కారణంగా నిలిపివేశారు.

కాకినాడ మత్స్యకారులకు విముక్తి

52 రోజుల తర్వాత

శ్రీలంక జైలు నుంచి విడుదల

రాజ్యసభ ఎంపీ సానా సతీష్ కృషి


శ్రీలంక జైలు నుంచి విడుదలైన నలుగురు మత్స్యకారులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జాఫ్నా జైలులో 52 రోజుల పాటు నిర్బంధంలో ఉన్న కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులు కె.శ్రీను వెంకటేశ్వర్లు, కర్రి నూకరాజు బుర్రయ్య, చందా నాగేశ్వరరావు, పంతాడి బ్రహ్మానందంలకు విముక్తి లభించింది. రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు గురువారం ఏపీ భవన్ కమిషనర్ డాక్టర్ అర్జా శ్రీకాంత్, శ్రీలంక కోస్ట్‌గార్డ్ కమాండర్ దినేష్ జేతో ప్రత్యేక సమన్వయం జరిపి కోర్టు నుంచి మళ్లీ స్పష్టమైన అనుమతులు వచ్చేలా కృషి చేయడంతో మత్స్యకారులు జైలు నుంచి విడుదలై స్వదేశానికి చేరుకున్నారు. వారిని శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేయగా శ్రీలంక నావికా దళం అధికారులు అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ వరకు తీసుకువచ్చి సాయంత్రం రామేశ్వరంలోని మండపం బేస్ సమీపం వద్ద భారత కోస్ట్ గార్డ్ అధికారులకు అధికారికంగా అప్పగించారు. గత ఆగస్టులో మత్స్యకారులు నాగపట్నం వెళ్లి పాత ట్రాలర్ పడవ కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా నావిగేషన్ లోపం కారణంగా శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించారు. దీంతో శ్రీలంక నావికా దళం గత ఆగస్టు 4న వారిని అదుపులోకి తీసుకుని జాఫ్నా జైలులో ఉంచారు. జాఫ్నాలోని కయిట్స్ సివిల్ కోర్టు సెప్టెంబరు 12న వారి విడుదలకు ఆదేశాలు జారీ చేసింది. ట్రాలర్‌ను కూడా తిరిగి ఇవ్వాలని ఆ కోర్టు ఆదేశించినా అనుసంధాన లోపాలు, ప్రక్రియల ఆలస్యం వల్ల మత్స్యకారుల స్వదేశీ రాక ఈనెల 25 వరకు వాయిదా పడింది. మత్స్యకారుల విడుదలైనట్టు ఎంపీ వెల్లడించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి

కేసు నమోదు

రాజానగరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతనామవరానికి చెందిన వివాహిత సయ్యద్‌హీరా (22) అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. దీనికి సంబంధించి ఎస్ఐ జీవీవీ.సత్యనారాయణ శుక్రవారం విలేకర్లకు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం అంబేడ్కర్ కాలనీకి చెందిన షేక్ వల్లీ తన కుమార్తె సయ్యద్ హీరాను పాతనామవరానికి చెందిన సయ్యద్‌బషీరుద్దీన్‌కు ఇచ్చి సుమారు ఐదేళ్ల క్రితం వివాహం చేసింది. అప్పటి నుంచి వారు పాతనామవరం ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల తమ అల్లుడు, అతడి తల్లి సయ్యద్ హమదున్నీసా, సాహిత్, బషీర్లు, మామగారైన బాజీ వీరందరూ కలసి తమ కుమార్తెను కట్నం కోసం రోజూ తిడుతూ వేధించారని మృతురాలి తల్లి పోలీసుల ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఈనెల 21న కుమార్తెను చూడడానికి నామవరం ఇంటికి వెళ్లగా కుమార్తె తల్లికి తన కష్టాలు చెప్పుకుని బాధపడింది. అయితే సర్దుకుపోవాలని కుమార్తెకు నచ్చచెప్పింది. అయితే తన కుమార్తె గురువారం మరణించిందని చెప్పారని.. తమ అల్లుడు, వారి బంధువులు చంపి ఉంటారని అనుమానంగా ఉందని షేక్ వల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేయగా నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాలక్ష్మీదేవిగా..


కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని రూ.8లక్షల కరెన్సీతో అలంకరించారు.
- కరప (ఆంధ్రజ్యోతి)


కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరంలో కనకదుర్గమ్మను రూ.4.50 లక్షల కరెన్సీతో మహాలక్ష్మిగా అలంకరించారు.
- పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి)


కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి అన్నపూర్ణాదేవి ఆలయంలో అమ్మవారికి రూ.1,11,116 కరెన్సీతో అలంకరణ
-ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి)


కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో వనదుర్గ, కనకదుర్గ మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు.
-అన్నవరం (ఆంధ్రజ్యోతి)

అభివృద్ధిలో క్రీడారంగం కీలకం

రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి.. ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ




బరిలో క్రీడాకారిణులు, మ్యాచ్‌లను తిలకిస్తున్న బీవీఆర్ చౌదరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశమైనా, రాష్ట్రమైనా పురోభివృద్ధి చెందాలంటే క్రీడారంగం ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుందని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని ఆర్ఎంసీ బ్యాడ్మింటన్ కోర్టులో జరుగుతున్న ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025 పోటీలు శుక్రవారం పోటా పోటీగా సాగాయి. రెండో రోజున జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్స్ పోటీలను బీవీఆర్ టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలసి మ్యాచ్‌లను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. క్రీడల అభివృద్ధికి రుడా నుంచి కూడా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. క్రీడల నిర్వహణలో రాజమహేంద్రవరం అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ముగ్గురి ఎంపిక



పిఠాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా గోపన్నపాలెం ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో శుక్రవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్థాయి ఆర్చరీ పోటీలు జరిగాయి. ఇందులో కాకినాడ జిల్లా పిఠాపురం సీబీఆర్ డిగ్రీ కళాశాల ఫైనలియర్ విద్యార్థి పి.కృష్ణ, సూర్యరాయ డిగ్రీ కళాశాల ఫస్టియర్ విద్యార్థిని కె.హరిణి, జి.మామిడాడ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల పీఈటీ ఫస్టియర్ విద్యార్థి పి.లోకేష్ విజేతలుగా నిలిచారు. ఈ ముగ్గురినీ ఇండియన్ రౌండ్ నన్నయ యూనివర్సిటీ మెన్, ఉమెన్ టీమ్ సభ్యులుగా ఎంపిక చేశారు. వీరు పంజాబ్ రాష్ట్రంలో జరుగబోయే జాతీయ స్థాయి ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారు. విజేతలు పిఠాపురానికి చెందిన ఆర్చరీ కోచ్ పి.లక్ష్మణరావు వద్ద శిక్షణ పొందుతున్నారు.

29న నిధి ఆప్‌కే నికత్

పీఎఫ్ ప్రాంతీయ అసిస్టెంట్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో ఈ నెల 29న 'నిధి ఆప్‌కే నికత్-డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం'ని నిర్వహిస్తున్నామని ప్రాంతీయ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ తెలిపారు. ఈపీఎఫ్ఐ ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థ, ఇతర ఫిర్యాదుల దాఖలులో నిబంధనలు, క్లెయిమ్‌ల తిరస్కరణకు కారణాలు, స్కీమ్ సర్టిఫికెట్ వల్ల ప్రయోజనాల వంటి వివిధ అంశాలను వివరించడం, ఫిర్యాదుల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్లు, కొత్తగా కవర్ కాబడిన వారు తమ ఫిర్యాదులను నిధి ఆప్‌కే నికత్ అని పేర్కొంటూ సమర్పించాలని చెప్పారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ బకాయి ఉన్న పింఛనుదారులు ఈ క్యాంపులో వాటిని అందజేయవచ్చని అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ పేర్కొన్నారు. ఏలూరు జిల్లా గోపాలపురంలోని శ్రీ సర్వారాయ షుగర్స్ బాట్లింగ్ యూనిట్, పశ్చిమ గోదావరి జిల్లాలో పాలకొల్లు సంధ్య మెరైన్, కాకినాడ జిల్లా తునిలోని శ్రీ ప్రకాశ్ విద్యానికేతన్, కోనసీమ జిల్లా యానాం అడవిపాలెంలో వాసవీ పిగ్మెంట్స్, తూర్పుగోదావరి జిల్లాలో రాజమండ్రి సమీపంలోని వెంకటాపురం జీఎస్ఎల్ ఎడ్యుకేషన్ సొసైటీ, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో నిధి ఆప్‌కే నిఖత్ ఉదయం 9గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రైతు బజారుకు నేడు సెలవు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ డిపో సమీపంలోని రైతుబజారు వ్యాపారి అయూబ్‌ఖాన్ మృతి చెందాడు. ఈ కారణంగా శనివారం రైతు బజారుకు సెలవు ప్రకటించినట్టు ఎస్టేట్ ఆఫీసర్లు కృష్ణారావు, గోవిందరాజు తెలిపారు. ఆదివారం యథావిధిగా కొనసాగుతుందన్నారు.



రాపర్తి గ్రామంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు, భక్తులు

దుర్గామల్లేశ్వరి అమ్మవారికి బోనాలు సమర్పణ

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం రాపర్తిలో వేంచేసియున్న దుర్గామల్లేశ్వరి అమ్మవారికి శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం భక్తులు బోనాలు సమర్పించారు. లలితాగౌరీ వ్రతం ఆచరించిన మహిళలు, భవానీలు బోనాలు ఎత్తుకుని ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. అమ్మవారి నామస్మరణతో గ్రామం మార్మోగింది. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పీఎం స్వనిధి పథకంలో వీధి వ్యాపారులకు రుణాలు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పీఎం స్వనిధి 2.0 పథకం, లోక్ కల్యాణ్ మేళాపై శుక్రవారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో టౌన్ ప్రాజెక్టు అధికారి కె.శైలజ అధ్యక్షతన అవగాహన సదస్సు వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద మాట్లాడుతూ వీధి విక్రయదారులు, చిన్న వ్యాపారులు పీఎం స్వనిధి పథకంలో మూడు విడతలుగా రుణం పొందవచ్చని తెలిపారు. ఇప్పటివరకు రుణాలు పొందని అర్హులైన లబ్ధిదారులు మెప్మా కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బ్యాంకర్లు అర్హులైన వారికి వెంటనే రుణాలు మంజూరు చేయాలని సూచించారు. లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజరు సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాల్లో వీధి వ్యాపారులు తప్పక భాగస్వాములు కావాలన్నారు. వీధి వ్యాపారులకు వైద్య శిబిరం నిర్వహించారు. మెప్మా జిల్లా అధికారి రవిశంకర్, మెప్మా సిటీ మిషన్ మేనేజరు డి. వెంకట్రాజు, పోస్టల్ మేనేజరు రాజకుమార్, ఫుడ్ సేఫ్టీ అధికారి నందాజీ, యూపీఏ సూపరింటెండెంట్ సతీష్, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, వెల్ఫేర్ సెక్రటరీలు, టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావాలి: డీఎల్డీవో శ్యామల

పెద్దాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషి చేయాలని డీఎల్డీవో మద్దిపట్ల శ్యామల కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఓన్ సోర్స్ రెవెన్యూ (ఓఎస్ఆర్) అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులపై ఆధారపడకుండా ఆస్తి పన్నులు, జీతాల పన్నులు, లైసెన్స్ ఫీజులు, నీటి పన్నుల ద్వారా సొంత ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. ఎంపీడీవో కేవీ సూర్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'విద్యార్థులు ప్రముఖుల చరిత్ర తెలుసుకోవాలి'

తాళ్లరేవు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖులు చేసిన పోరాటాలు, వారి చరిత్రలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ సత్యనారాయణ కోరారు. శుక్రవారం కళాశాలలో బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. కెమిస్ట్రీ లెక్చరర్ వి.భారతి, బోటనీ లెక్చరర్ కె.దుర్గామల్లేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



కరప మండలం నడకుదురులో లక్ష్మీదేవి అలంకారంలో కనకదుర్గ.... అమ్మవారికి సారె తీసుకెళ్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్ దంపతులు, ముత్తయిదువులు, కాకినాడ ఫ్రేజరుపేటలో సువాసిని పూజ చేస్తున్న ముత్తయిదువులు

భక్తి శ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు

కరప, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నడకుదురులో కనకదుర్గ అమ్మవారు శుక్రవారం లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గుల్లిపల్లి వారి వీధి నుంచి మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో ముత్తయిదువులు పట్టువస్త్రాలు, పండ్లు, పూలు, పసుపు, కుంకుమ, పిండి వంటలు, ఇతర సారె పట్టుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉప సర్పంచ్ గుల్లిపల్లి మాధవ్, దుర్గారావు, చీపురుపల్లి రాము, చొక్కాకుల శ్రీనివాస్, గరెడ్డి వీరరాఘవులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): స్థానిక 36వ డివిజన్ ఫ్రేజర్‌పేటలోని దుర్గాభవానీ ఆలయం వద్ద నాగం శ్రీనివాస్-వెంకట సత్యవతీదేవి దంపతుల ఆధ్వర్యంలో 509 మంది ముత్తయిదువులతో సువాసిని పూజను ఘనంగా నిర్వహించారు. శ్రీదుర్గాభవానీ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమలో నిర్వాహకుడు సాధనాల శ్రీనివాస్, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, నలూరి తులసి, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్నీ, నాగం కొండబాబు దంపతులు, ఈశ్వరరావు, ప్రసాద్, కుంభ, రమేష్, దొరబాబు, కుమార్, వంశీ పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు కరణం గారి తోటలోని కనకదుర్గమ్మను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు దర్శించి పూజలు చేశారు. ఆదిభవానీ ని వారు సత్కరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అధికారులకు శ్రద్ధ ఏదీ!

సామర్లకోట కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ధ్వజం

సామర్లకోట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నెలవారీ సమావేశాల్లో మీముందుకు తీసుకొచ్చినా ముక్తసరిగా సమాధానం ఇవ్వడం మినహా పరిష్కరించట్లేదు. తదుపరి సమావేశాల్లో మాకు తెలియజేయకపోవడం విచారకరం' అని అధికారుల వైఖరిపై పలువురు కౌన్సిలర్లు తీవ్రంగా ధ్వజమెత్తారు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఛైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. పట్టణంలో పలు సమస్యలను జీరో అవర్‌లో కౌన్సిలర్లు రాజ్‌కుమార్, కాళ్ల శ్యామల, పాలిక కుసుమ, పిట్టా సత్యనారాయణ, కో-ఆప్షన్ సభ్యులు మన్యం చంద్రరావు, రెడ్డి లోవకుమారి, పిల్లాడి సత్యవతి అధికారుల దృష్టికి తీసుకొచ్చి వారి తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై అజమాయిషీ కొరవడిందన్నారు. ఏ చిన్న సమస్యనూ పట్టించుకోవట్లేదని ఆరోపించారు. కమిషనరు శ్రీవిద్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఇచ్చిన వివరణలపై సభ్యులు ఎంతమాత్రం సంతృప్తి వ్యక్తం చేయలేదు. కో-ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు మాట్లాడుతూ ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ఆవరణలో లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసిన రెండు గొట్టపుబావుల నుంచి సుద్ద నీరు పంపింగ్ అవుతున్నందున మంచినీరు పంపింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సత్వరం చర్యలు తీసుకుంటామని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చ జరిగింది. 1, 46, 48, 51 అంశాలను వాయిదా వేసి మిగిలిన అంశాలను సభ్యులు ఆమోదించారు. సీబీఎం సెంటర్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతించాలని పలువురు కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్ సునేత్రాదేవికి వినతిపత్రం అందజేశారు.

డీఎస్సీలో వ్యాయామోపాధ్యాయ ఉద్యోగం

కౌన్సిలర్ పదవికి జగదీష్ రాజీనామా... ఆమోదం



సామర్లకోట మున్సిపల్ కౌన్సిలర్ యార్లగడ్డ జగదీష్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. డీఎస్సీలో క్రీడా కోటాలో వ్యాయామోపాధ్యాయుడిగా ఎంపికైన ఆయన గురువారం అమరావతిలో ఉత్తర్వులు అందుకున్నారు. అయితే శిక్షణ తరగతులకు ముందుగా నిబంధనల మేరకు పదవికి రాజీనామా చేయాల్సి ఉంది. శుక్రవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఆయన రాజీనామా పత్రం సమర్పించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అచ్చంపేటలో 33 కేవీఏ నూతన సబ్ స్టేషన్ నిర్మాణం లైన్‌వర్క్‌ల్లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. పనసపాడు 11 కేవీఏ ఫీడర్, 11 కేవీఏ వాకలపూడి ఫీడర్, 33 కేవీఏ దేవీ ఫీడర్, అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని సామర్లకోట ఏడీఈ కిరణ్, ఏఈ నాగేశ్వరరావు చెప్పారు.

29న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస ఆధ్వర్యంలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు.

'మనోబంధు ఫౌండేషన్ సేవలు హర్షణీయం'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేకుండా వీధుల్లో తిరిగే వారిని సమీకరించి వారికి వైద్య, వసతి సదుపాయాలు కల్పించి తిరిగి తమ కుటుంబాలతో కలిపేలా సేవలు అందిస్తున్న మనోబంధు ఫౌండేషన్ సభ్యులను రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ వైడీ రామారావు అభినందించారు.



కాకినాడ నగరం, పరిసర ప్రాంతాల్లో మానసిక రుగ్మతతో బాధపడుతూ తిరుగుతున్న నలుగురిని మనోబంధు సంస్థ రెడ్‌క్రాస్ సహకారంతో సమీకరించి విశాఖపట్నంలోని మానసిక రోగుల ఆసుపత్రికి తరలిస్తున్న అంబులెన్స్‌ని రామారావు ప్రారంభించారు. భవిష్యత్తులో రాష్ట్రమంతటా మనోబంధు ఫౌండేషన్‌తో కలిసి పనిచేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రామారావు తెలిపారు. కార్యక్రమంలో మనోబంధు ఫౌండేషన్ ట్రస్టు సభ్యులు, విశ్రాంత ఐఏఎస్ డి.చక్రపాణి, భూపతిరాజు రామకృష్ణరాజు, రెడ్‌క్రాస్ కార్యదర్శి కె.శివకుమార్, వైద్యాధికారులు డాక్టర్ పి.దుర్గరాజు, డాక్టర్ ఎస్.పరాశర, డాక్టర్ డి.రామ్‌మోహన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన మాజీ మంత్రి చిక్కాల

గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని వినతి



కాజులూరు (కరప), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేశ్‌లను కలిసి మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు కలిశారు. గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు దుస్థితిపై వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆయన కాజులూరులో విలేకరులతో మాట్లాడుతూ న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులు రూ.32కోట్లతో చేపట్టిన గొల్లపాలెం-కుయ్యేరు ఆర్అండ్‌బీ రోడ్డు అర్ధంతరంగా నిలిచిపోయిందన్నారు. దీంతో ఏళ్ల తరబడిగా అన్ని వర్గాల ప్రజలు ప్రయాణాలు చేయలేక నానా అవస్థలు పడుతున్నారని సీఎంకు వివరించినట్టు చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యం, నిధుల మళ్లింపుతో ఆగిపోయిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే రోడ్డును పునః ప్రారంభించాలని కోరుతూ ఇటీవలే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కూడా కలిసి కోరినట్టు చెప్పారు.

ఎంపీ సతీష్‌బాబును కలిసిన ఎమ్మెల్సీ పద్మశ్రీ



కాకినాడ సిటీ/సామర్లకోట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగర అభివృద్ధి, స్థానిక సమస్యలు, భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలపై రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబుతో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ చర్చించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీ చేరిన పద్మశ్రీ- నారాయణ దంపతులు శుక్రవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ సతీష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసారు. శ్రీలంక జాఫ్నా జైలులో నిర్బంధంలో ఉన్న కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులను స్వదేశానికి రప్పించేందుకు కృషి చేసినందుకు ఎంపీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఆక్వా చెరువులకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

మత్స్య శాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు



కరప, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆక్వా రైతులు తమ చెరువులను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మత్స్య శాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి మధుబాబు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆక్వా రంగం సుస్థిరత, నిర్దిష్ట సమాచారం కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోందన్నారు. ఇందులో భాగంగా రూపొందించిన ఒక ప్రత్యేక యాప్‌లో రైతులు తమ చెరువుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వపరంగా అందే అన్ని రాయితీలు వర్తించాలంటే గడువులోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్‌లతో సంబంధం లేకుండా మీ-సేవ సర్టిఫికెట్, పాత లైసెన్స్ ఉన్నవారు కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని మధుబాబు వివరించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి : డీఎంహెచ్‌వో

కరప, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ సూచించారు. శుక్రవారం ఆయన వేళంగి పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ అమలు తీరుపై సమీక్షించారు. రోగులకు అందుతున్న సేవలు, వ్యాక్సినేషన్, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సూర్యచంద్ర, వైద్యాధికారులు రమావత్ శ్రీనివాస నాయక్, డాక్టర్ అనూష్, ఎంపీహెచ్ఈవో గోవింద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

8,9 తేదీల్లో కాకినాడలో ఫిలాటెలీ ఎగ్జిబిషన్

కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కృష్ణ

కాకినాడ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్యకళా మందిరంలో వచ్చే నెల 8,9 తేదీల్లో ఫిలాటెలీ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ ఎగ్జిబిషన్‌ను ఫిలాటెలిస్టులు, విద్యార్థులు, ప్రజలు ఉచితంగా తిలకించవచ్చన్నారు. మై స్టాంప్ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్లు రమణమూర్తి, కేపీఎల్‌వీఎస్ మూర్తి పాల్గొన్నారు.

ఎంపీ ప్రజా దర్బార్‌కు 22 అర్జీలు

సామర్లకోట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొప్పవరంలోని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పలువురు అర్జీలు అందజేశారు. మొత్తం 22 అర్జీలు అందగా వాటిలో పది సమస్యలను సత్వరం పరిష్కరించారు. మిగిలిన వాటిని తక్షణం పరిష్కరించాలని ఆయా శాఖల ఉన్నతాధికారులకు అందజేసినట్టు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. ఆనంద్‌న్యూటన్, ముత్యాల అనిల్, చింతపల్లి అర్జున్, జున్నూరు బాబ్జీ, సిరియాల కొండబాబు, పాలిక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వలసపాకల ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమణలపై సర్వే

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వలసపాకల గానుగ చెట్టు రోడ్డు నెం.6 మెయిన్‌రోడ్డు నుంచి రామాలయం వరకు ఆర్అండ్‌బీ రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను శుక్రవారం ఆ శాఖ సిబ్బందితో కలిసి సర్వే అధికారులు సర్వే చేశారు. ఈరోడ్డు కిరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని, సర్వే చేపట్టాలని పితాని రాము కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సర్వే నిర్వహించారు. ఆక్రమణలను గుర్తించి నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు ఇచ్చిన అనంతరం తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ అధికారులు చెప్పారు.

విద్యతో పాటు క్రీడలు ముఖ్యం

గండేపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ గర్ల్స్ హాస్టల్‌లో నిర్వహించిన కబడ్డీ ఫైనల్ పోటీలు నిర్వహించారు. యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్.నల్లమిల్లి శేషారెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. యువతకు విద్యతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. విజేత టీమ్‌కు ట్రోఫీ అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో హాస్టల్ ఇంచార్జ్ జి.హరిష్ రెడ్డి, వార్డెన్ సరిత ఫీజికల్ డైరెక్టర్ డాక్టర్ రవి, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మళ్లీ పెరుగుతున్న గోదావరి వరద

● భయాందోళనలో రైతులు, స్థానికులు
● వివిధ గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు


రామవరం దగ్గర రోడ్డుపై నీరు

వీఆర్‌పురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతా ల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి మళ్లీ వరద పెరుగుతోంది. దీంతో మండల రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి కన్నాయిగూడెం, తుష్టివారిగూడెం, రామవరం, శ్రీరామగిరి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులపై వరద నీరు వచ్చి చేరడంతో సుమారుగా 30 గ్రామాలకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం వద్ద సాయంత్రానికి 44.7 అడుగులకు చేరుకుంది.

కూనవరం: గోదావరి మళ్లీ రావడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. కానీ ఈసారి మిర్చి, వరిచేను సాగులో ఉండడంతో పొలాల్లోకి నీరు వచ్చింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సాయంత్రం గోదావరి 37.50 అడుగుల వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తోంది.

ఎటపాక: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద తాకిడి పెరుగుతోంది. దీంతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలే గన్నవరం, మురుమూరు, నందిగామ, గౌరిదేవిపేట, నెల్లిపాక, గుండాల రైతులు మిర్చిని సాగు చేశారు. కాగా, భద్రాచలం వద్ద శుక్రవారం రాత్రికి 44.70 అడుగుల నీటిమట్టం దాటడంతో పలు గ్రామాల్లో మిర్చిపంట నీటమునిగింది.

సొంత డబ్బులతో కల్వర్టుకు మరమ్మతులు

మోతుగూడెం,సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద గల నాలుగు రోడ్ల జంక్షన్‌లో మూడు నెలల కిందట కల్వర్టుపై ఉన్న సిమెంట్ దిమ్మ విరిగిపోయింది. దీంతో ఆ రహదారి గుండా నడిచేవెళ్లే వాళ్లు వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతుండేవారు. దీన్ని గమనించిన మోతుగూడెం టీడీపీ యూత్ దసరా సెలవులు కావడంతో శుక్రవారం సిమెంట్ దిమ్మలను తెప్పించి మరమ్మతులు చేపించారు. దీనికి టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు తన సొంత నిధులు కేటాయించారు. దీంతో అటుగా వెళుతున్న గ్రామస్థులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూత్ అంగసాయి, వేగి బబ్బులు, వేగి సాయి పవన్, పాసినాయుడు, రాము పులిపాటి, సేతు పాల్గొన్నారు.

బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

చింతూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని చింతూరు డివిజన్ జేఏసీ చైర్మన్ జల్లి నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం చింతూరులో జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ... తెలంగాణ ఆదివాసీలు బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్న డిమాండ్‌తో చేస్తున్న పోరాటానికి తమ జేఏసీ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ కేంద్ర కమిటీ సభ్యుడు మడివి నెహ్రూ, ఉద్యోగ నాయకులు తిమ్మసాయి, తోడెం దేశయ్య, నాయకులు కారం సాయిబాబు, పొడియం రామకృష్ణ, తుర్రం రాముడు, కుంజా శ్రీను, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరంలో సీఆర్‌పీలకు శిక్షణ

రంపచోడవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో సీఆర్‌పీలకు ఘన వ్యర్థాల నిర్వహణ - గృహ స్థాయి వ్యర్థాల వర్గీకరణపై శిక్షణ నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో వై.రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 1000 కుటుంబాలకు ఒక సీఆర్‌పీ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ చవలం తమ్మన్నదొర, పంచాయతి కార్యదర్శి వినోలి, ఎఫ్‌టీసీ సుబ్బారావు, రంపచోడవరం, గంగవరం, దేవీపట్నం, మారేడుమిల్లి మండలాల సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల మంజూరులో అలసత్వం తగదు

రంపచోడవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అర్హులకు పింఛన్లు మంజూరు చేయడంలో ఉన్నతాధికారులు, సచివాలయ సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని సీపీఐ డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్ అన్నారు. స్థానిక ఎర్రంరెడ్డి నగరానికి చెందిన చెరుకూరి చక్రపాణి ప్రమాదానికి గురై గత రెండు సంవత్సరాలుగా మంచానికే పరిమితమయ్యారని, ఆయనకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి సహాయసహకారాలు అందలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు గోము దుర్గ, డివిజన్ కమిటీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వంతల కృష్ణ పాల్గొన్నారు.

మహిళలకు మెరుగైన ఆరోగ్యమే లక్ష్యం

దేవీపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలకు మెరుగైన ఆరోగ్యం అందించడమే లక్ష్యమని ప్రధాని మోదీ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పీవీఎల్ నీలిమ అన్నారు. శుక్రవారం ఇందుకూరు వన్ ఆర్ అండ్ ఆర్ కాలనీ ఆరోగ్య కేంద్రం వద్ద స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుంజం రాజమణితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎం. వెంకటేశ్వరరావు, పీ.చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్ పీ.బంగారయ్య హెచ్ బీ.లక్ష్మి, పీహెచ్ఎన్ రాఘవమ్మ, ఏఎన్ఎంలు నూక రత్నం, చెల్లెమ్మ ధనలక్ష్మి, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూస్తాం

ఎటపాక, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటూ, సర్దుబాట్లు చేస్తున్నామని ఏవో దుర్గా రమేష్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశపు హాల్లో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ వేరే గ్రామాల్లో యూరియా పంపిణీ చేసే సమయంలో పొరుగు గ్రామాల తమకు ఇవ్వడం లేదని సభ దృష్టికి తెచ్చారు. దీంతో ఏవో స్పందించారు. చోడవరం, తోటపల్లి, ఎటపాక రైతు సేవా కేంద్రాల్లో ఇప్పటి వరకు 90 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేసినట్టు చెప్పారు. రాయనపేట, గుండాల గ్రామాల రైతులకు టోకెన్లు జారీ చేసి పంపిణీ చేస్తామని తెలిపారు. తహశీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీపీ కాకకామేశ్వరి, జడ్పీటీసీ సుస్మిత, వైఎస్ ఎంపీపీ మంగేశ్వరరావు పాల్గొన్నారు.

8,9 తేదీల్లో కాకినాడలో ఫిలాటెలీ ఎగ్జిబిషన్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్యకళా మందిరంలో వచ్చే నెల 8,9 తేదీల్లో ఫిలాటెలీ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ ఎగ్జిబిషన్‌ను ఫిలాటెలిస్టులు, విద్యార్థులు, ప్రజలు ఉచితంగా తిలకించవచ్చన్నారు. మై స్టాంప్ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


మహాలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న తలుపులమ్మ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఐదోరోజు ఉత్సవాల్లో అమ్మ వార్లను మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ధర్మవరం విజయదుర్గ, రాచపల్లి అపీత కుచాంబ, ప్రత్తిపాడు, ఒమ్మంగి కనకదుర్గఅమ్మవార్లను మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ధర్మవరం, రాచపల్లి ఆలయాల్లో మహిళలచే కుంకుమ పూజలు,అభిషేకాలు నిర్వహించారు.

శంఖవరం(ఆంధ్రజ్యోతి): కత్తిపూడి లారీ యూనియన్ ఆధ్వర్యంలో ఉన్న కనకదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో నోట్లతో సుందరంగా అలంకరించారు. భారీసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్న సంతర్పణ నిర్వహించారు.

గండేపల్లి(ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రులు సందర్భంగా శుక్రవారం గండేపల్లిలో దుర్గమ్మ అమ్మవారు మహాలక్ష్మి అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు.

మహాలక్ష్మిదేవిగా తలుపులమ్మ

తుని(ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మీదేవిగా తలుపులమ్మ అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు దర్శించి పూజలు చేశారు.

జగ్గంపేట(ఆంధ్రజ్యోతి): శుక్రవారం దేవీ సెంటర్‌లో లలితా భువనేశ్వరి ఆలయంలో అమ్మవారిని లలితత్రిపురసుందరిగా అలంకరణచేసి పూజించారు.

దుర్గమ్మ సేవలో భవానీ భక్తులు

కిర్లంపూడి(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవరంలో దుర్గమ్మ ఆలయంవద్ద దేవి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు తరలివచ్చి దీక్ష ఆచరించారు. శుక్రవారం మహాలక్ష్మి రూపంలో అమ్మవారి భక్తులకు దర్శనమిచ్చారు.

కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ

ఏలేశ్వరం(ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రుల్లో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మహాలక్ష్మి అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. వైఆర్‌సీ వద్ద శ్రీగాంధారమ్మ తల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, మాతృశక్తి నేతృత్వంలో మహిళలు అమ్మవారికి సారె సమర్పించి, కుంకుమ పూజలు, పారాయణం చేశారు. సంతోషిమాత ఆలయంలో సుమారు రూ.19వేలు కరెన్సీ నోట్లతో తీర్చిదిద్దారు. వీహెచ్‌పీ కార్యదర్శి కటకం కిరీటి, అలమండ దుర్గాప్రసాద్, తూరౌతు గురవయ్య పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరిగా అమ్మవారు

తొండంగి(ఆంధ్రజ్యోతి): ఏవీనగరంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో కొలువైన అమ్మవారు శుక్రవారం బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు మిశ్రా, చరణ్ పూజా క్రతువులు నిర్వహించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం(ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అమ్మవారికి జపములు, పారాయణలు నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


ఏలేశ్వరం తోట వీధిలో అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరణ


లలితత్రిపుర సుందరి


రాచపల్లిలో అపీత కుచాంబ అమ్మవారు


మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ.

పంచాయతీల ఆదాయ వనరుల పెంపునకు కృషి చేయాలి


శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో సాయి

తొండంగి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీల్లో ఆదాయ వనరుల పెంపునకు కృషి చేయాలని ఎంపీడీవో సాయి నవీన్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో 2రోజుల పాటు జరగనున్న కార్యదర్శిలు, సర్పంచ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అనేక వనరులు ఉన్నాయని వాటిని గుర్తించి ఆదాయవనరులుగా మార్చడంలో కార్యదర్శిలు కీలకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రేమ్, కార్యదర్శిలు రాజబాబు, సురేష్, వీరలక్ష్మి, సర్పంచ్‌లు సోమాల ప్రసాద్, అంగు లూరి సుధాకర్, తాటిపర్తి శ్రీను, పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ


గండేపల్లిలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

గండేపల్లి,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి ట్రైనింగ్ ప్రోగ్రాం ఓన్‌సోర్స్ రెవెన్యూపై శిక్షణ నిర్వహించారు. గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ప్రాజెక్టు నిర్వహణ నైపుణ్యాల ప్రాముఖ్యత, పన్ను వసూళ్ల కోసం సమాజంలో వ్యక్తిగత ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలను తెలిపారు. ఎంపీడీవో కె.హరికృష్ణ సత్యరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఐఎస్ శ్రీనివాసు, ఏవో కె.చంద్ర రావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శంఖవరం,(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీల్లో ఆదాయ వనరులు సృష్టించాలని ఎంపిపి పర్వత రాజబాబు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ హాలులో ఆయన అధ్యక్షతన మండల స్థాయి శిక్షణా సమావేశం నిర్వహించారు. ఆస్తి, ఇతర పన్నులతో సహా వనరులను సృష్టించుకుని పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో వై.నాగలక్ష్మి, ఏవో పుష్పమికీర్తి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి


హంసవరంలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేపడుతున్న దృశ్యం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని సర్పంచ్ తటవర్తి సుబ్బారావు దొర అన్నారు. మండలంలోని టి.రాయవరం గ్రామంలో శుక్రవారం రాచపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి ఉషశ్రీతో కలిసి మహిళలకు మందులు పంపిణీ చేశారు. వెంకటనగరం గ్రామంలో ప్రత్తిపాడు ఐసీడీఎస్ సీడీపీవో అధికారి పద్మావతి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ ఆవశ్యకతను వివరించారు. సూపర్‌వైజర్ ఎన్.వరలక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

తుని రూరల్,(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి అన్నారు. హంసవరం గ్రామంలో స్వస్థ నాని సస్వస్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని తుని సీఐ గీతా రామకృష్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాలిబోయిన గంగాధర్, మడికి ఉదయభాస్కర్, విజయ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఏలేశ్వరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పేరవరంలో జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైన కుటుంబానికి హెల్పింగ్‌యూత్ సభ్యులు బియ్యం, వంట సామాగ్రి, రూ.2వేలు, నిత్యావసర సరుకులు... ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందర్రావు 50కిలోల బియ్యం, వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. మద్దుల స్వరూప్, బండి కోటి, రామ్‌లాల్, పర్వత శివ , ఆలీషా, ఆనంద్ జోషి, వేమగిరి సత్యానందం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యం రిజిస్ట్రేషన్లపై అవగాహన

శంఖవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యం రిజిస్ట్రేషన్ ఎంఎస్ ఎంఈల అభివృద్ధి ద్వారమని ఏపీఎం విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉద్యం రిజిస్ట్రేషన్లపై అవగాహన నిర్వహించారు. తక్కువ వడ్డీరేట్లకు రుణాలు పొందడం, ప్రభుత్వ టెండర్లకు అనుమతి పొందడం వంటి అర్హతలు ఉద్యం రిజిస్ట్రేషన్ ద్వారా పొందవచ్చాన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెదమల్లాపురం కేంద్రంగా గిరిజన మండలాన్ని ఏర్పాటుచేయాలి

శంఖవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెదమల్లాపురం కేంద్రంగా గిరిజన మండలాన్ని ఏర్పాటు చేయాలని గిరిజనులు ఎంపీ ఉదయ శ్రీనివాస్‌కు విన్నవించారు. జనసేన నేత గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీని కలిసిన గిరిజన సంఘాల నేతలు కొత్త మండలం ఏర్పాటుచేసి రంపచోడవరం జిల్లాలో విలీనం చేయాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న కొత్త జిల్లాలు, మండలాల పునర్విభజనలో మా వినతిని పరిశీలించాలని కోరా రు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ ప్రభుత్వం దృష్టి తీసుకెళ్తామని, గిరిజనులు సమస్యలు పరిష్కరించేవిధంగా చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పెదమల్లాపురం జనసేన అధ్యక్షుడు కొరుప్రోలు రమేష్, జర్త సరస్వతి, జర్త శ్రీను, తురుం నాగేశ్వరరావు, జర్త మునలయ్య పాల్గొన్నారు.


ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

తుని సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే గళం



తుని రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే గళం వినిపించారు. ప్రధాన సమస్యగా కొండవారిపేట తూము పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రిని కోరారు. తూము సమస్యతో పట్టణంలో 10వార్డుల ప్రజలు పడుతున్న కష్టాలను ఎమ్మెల్యే సభలో ప్రస్తావించారు. తూము సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు రైల్వే శాఖ వద్ద కూడా ఉన్నాయని, ప్రభుత్వం చొరవ చూపిస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు.

లోవలో ఆర్డీవో పూజలు

తలుపులమ్మ లోవ దేవస్థానంలో పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి పూజలు ఆచరించారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి శేష వస్త్రం కప్పి సత్కరించారు. తహశీల్దార్ ప్రసాద్, వీఆర్వోలు ఉన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు


టీడీపీలోకి చేరిన వారితో యనమల రామకృష్ణుడు

తునిరూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం గ్రామం నుంచి టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి అధ్యక్షతన గ్రామ కార్యకర్తలు కాపరపు అబ్బులు, అత్తి అచ్యుతరావు, పోల్నాటి కృష్ణ ఆధ్వర్యంలో వందలాది మంది వైసీపీ కార్యకర్తలు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సమక్షంలో టీడీపీలోకి చేరారు. చేరిన వారిలో అప్పన అశోక్, ఏడిద ఏసుబాబు, ఏడిద కన్నారావు, రాయి పంపయ్య, రాయి జోగిరాజు, అత్తి కొండలరావు, జువ్వల బాలకృష్ణ పాటుగా పలువురు ఉన్నారు.